నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
గురువారం
04-09-2025
పేజీలు: 02



## 'ఆల్కహాల్' టీజర్ రిలీజ్

అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఆల్కహాల్. ఈ సినిమాకు మెహర్ రాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్టైనమెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌లపై నాగవంశీ, త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతుంది. అయితే తాజాగా ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.



సూర్య దినపత్రిక ప్రధాన కార్యాలయంలో చైర్మన్ నూకారపు సూర్య ప్రకాష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడిని పూజలు నిర్వహించి, సూర్య ప్రధాన కార్యాలయంలో భారీ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాంచందర్ రావు,నెటవర్క్ ఇంచార్జి భాస్కర్ రావు,హెచ్.ఆర్. నాగ భూషణం , ఆర్.ఏం శ్రీనివాస్ , రాంగోపాల్ ,రాజు , యశోద కృష్ణ,కార్టూనిస్ట్ నారు, కృష్ణ మోహన్ , పర్వీన్ వెంకట్ రావు, వెబ్ సైట్ ఇంచార్జి అహ్మద్ మరియు తదితరులు పాల్గొన్నారు



### మోదీ మెప్పు కోసమే సీబీఐ విచారణ..

# రేవంత్‌పై పల్లె రవికుమార్ ధ్వజం

ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కేసును సీబీఐకి సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారని బీఆర్ఎస్ నేత పల్లె రవి కుమార్ ధ్వజమెత్తారు. దేవీ ప్రసాద్‌తో కలిసి పల్లె రవికుమార్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ ప్రజాస్వామ్యం గురించి ప్రవచనాలు చేస్తారే తప్ప పాటించరు. ప్రజా పాలన అనేది అమలు కావడం లేదు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోంది. ఈ రోజు బీఆర్ఎస్ నేతలగృహ నిర్బంధాన్ని ఖండిస్తున్నాం. గంప గోవర్ధన్, సురేందర్‌ను వెంటనే విడుదల చేయాలి. పోలీస్ పహారాలో సీఎం పర్యటనలు కొనసాగుతున్నాయని పల్లె రవికుమార్ మండిపడ్డారు. సచివాలయం వదిలి సీఎం పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పాలిస్తున్నారు. సీఎం చెప్పింది చేయరు. బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడం వెయ్యి మంది రేవంత్‌లు పుట్టినా సాధ్యం కాదు. తెలంగాణకు రక్షణ కవచం.. తెలంగాణ అస్థిత్వానికి ప్రతీక బీఆర్ఎస్ అని రవికుమార్ తేల్చిచెప్పారు. సీబీఐ విచారణ మోదీ మెప్పు కోసమేనా రేవంత్ రెడ్డి..? రాహుల్ గాంధీ వద్దన్న సీబీఐకి తెలంగాణలో ప్రవేశం ఎందుకు..? సీఎం ద్వంద్వ ప్రమాణాలను తెలంగాణ సమాజం గమనిస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం పిచ్చి మాటలు మాట్లాడితే ప్రజలు హర్షించరు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం అని పల్లె రవికుమార్ పేర్కొన్నారు.





## ట్రాఫిక్‌తో విసుగెత్తి.. బైక్‌ను భుజంపై వేసుకొని..

ఎడతెరిపి లేని వర్షాల కారణంగా దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ-ఎన్సీఆర్‌లో ఇటీవలే భారీ ట్రాఫిక్ జామ్ అయిన విషయం తెలిసిందే. రెండు గంటల పాటూ నిరంతరాయంగా కురిసిన వర్షానికి ఢిల్లీ-గురుగ్రామ్ జాతీయ రహదారిపై 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి వాహనదారులు రోడ్డుపై ఎటూ కదల్లేక నరకయాతన అనుభవించారు. ట్రాఫిక్‌కు విసిగిపోయిన ఓ వ్యక్తి ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. ఓ వ్యక్తి సాయంతో తన బైక్‌ను ఏకంగా భుజంపై వేసుకుని నడుచుకుంటూ వెళ్లారు. అతడి చర్యతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా షాక్‌తో అలా చూస్తూ ఉండిపోయారు. కొందరు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'గురుగ్రామ్ ట్రాఫిక్‌కు ఒకే ఒక పరిష్కారం..' అంటూ వీడియోకి క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.




### ఆగస్టు 2025లో నెట్టింట హాట్ టాపిక్ అయిన

## సెలబ్రిటీలు - టాప్ 10 లిస్టు

నరేంద్ర మోదీ - భారత ప్రధాని
జూనియర్ ఎన్టీఆర్ - టాలీవుడ్ స్టార్ హీరో
దళపతి విజయ్ - కోలీవుడ్ హీరో, రాజకీయ నాయకుడు
పవన్ కళ్యాణ్ - జనసేన అధినేత, సినీ నటుడు
శుభ్‌మన్ గిల్ - టీమిండియా టెస్ట్ కెప్టెన్
రాహుల్ గాంధీ - కాంగ్రెస్ నేత
విరాట్ కోహ్లీ - టీమిండియా మాజీ కెప్టెన్
మహేష్ బాబు - టాలీవుడ్ సూపర్ స్టార్
ఎంఎస్ ధోనీ - టీమిండియా లెజెండ్
రజనీకాంత్ - తమిళ సూపర్ స్టార్

ఈ టాప్ 10 లిస్టులో 5 మంది సినిమా స్టార్లు ఉన్నారు. విశేషంగా, బాలీవుడ్ నుంచి మాత్రం ఎవరూ లేరు. టాలీవుడ్ నుంచి ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్, మహేష్ బాబు ఉండగా, కోలీవుడ్ నుంచి విజయ్, రజనీకాంత్ నిలిచారు. అయితే ఎన్టీఆర్ ఎందుకు ట్రెండింగ్‌లోకి వచ్చాడంటే. 'RRR' తో గ్లోబల్ క్రేజ్ తెచ్చుకున్న తారక్, ఇటీవల విడుదలైన 'దేవర'తో మరో హిట్ అందుకున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్ చేస్తుండగా, ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే ఆయన బాలీవుడ్ ఎంట్రీ ఫిల్మ్ 'వార్ 2' ఆగస్టు నెలలో రిలీజ్ కావడం వల్ల నెట్టింట అతడిపై చర్చలు పెరిగాయి. తమిళ స్టార్ దళపతి విజయ్ తన రాష్ట్రీయ పార్టీని ప్రారంభించగా, ఇది ట్రెండింగ్ టాపిక్ అయింది. ఆయన త్వరలో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం విజయ్ నటిస్తున్న 'జన నాయకుడు' సినిమా, ఆయన చివరి చిత్రం కానుంది అని ప్రచారం జరుగుతోంది.

### చౌటుప్పల్‌లో పెరుగుతున్న బైక్ దొంగతనాలు..

# ప్రజల్లో ఆందోళన

చౌటుప్పల్ పట్టణంలో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల అరిటాకు భోజనం హోటల్ సమీపంలో పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన కలకలం రేపుతోంది. ఈ చోరీకి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదయ్యాయి. ఇది ఏకైక ఘటన మాత్రమే కాదు. గత కొన్ని రోజులుగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వరుసగా ద్విచక్ర వాహనాలు మాయం అవుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ఈ దొంగతనాల శైలిని పరిశీలిస్తే, ఇది ఒక ప్రణాళికాబద్ధమైన గ్యాంగ్ పని కావచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో బైక్ చోరీలు పెరుగుతున్నా, పోలీసు శాఖ దొంగలను పట్టుకోవడంలో ఇప్పటివరకు ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ కెమెరాల్లో నమోదైన ఆధారాలు ఉన్నప్పటికీ, విచారణ పురోగతిలో ప్రగతిలేకపోవడం ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది. దొంగతనాల నియంత్రణ కోసం పోలీసు శాఖ గట్టిగా స్పందించాలి,




నియమిత టపాలు నిర్వహించి, అవసరమైతే నైట్ పేట్రోలింగ్‌ను పెంచాలి అని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా బైక్ దొంగలపై కఠిన చర్యలు తీసుకొని, పట్టణంలోని ప్రజలకు భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### ఆర్ఎస్ఎస్ చీఫ్‌తో..

# వసుంధర రాజే రహస్య సమావేశం

రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్‌తో రహస్యంగా సమావేశమయ్యారు. ఈ ప్రత్యేక భేటీ సుమారు 20 నిమిషాలు కొనసాగింది. జోధ్‌పూర్‌లో రెండు రోజుల పర్యటనలో ఉన్న బీజేపీ సీనియర్ నాయకురాలు వసుంధర రాజే, గురువారం రామ్‌డియోరా మందిరానికి వెళుతూ లాల్ సాగర్ ప్రాంతంలోని ఆదర్శ్ విద్యా మందిర్‌లో మోహన్ భగవత్‌ను కలిశారు. వారిద్దరి ప్రత్యేక సమావేశం సుమారు 20 నిమిషాలు కొనసాగింది. ఆమె సన్నిహితులు, పార్టీ నేతలు ఎవరూ కూడా సమావేశ గదిలో లేరు. కాగా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో వసుంధర రాజే ఏం చర్చించారు, ఏం మాట్లాడారు అన్నది తెలియలేదు. అయితే కొంత కాలంగా బీజేపీ కార్యకలాపాలకు ఆమె దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా మోహన్ భగవత్‌ను ప్రత్యేకంగా కలుసుకోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. అనంతరం జోధ్‌పూర్‌లోని రెండు పుణ్యక్షేత్రాలైన సురాసాగర్‌లోని బడా రామద్వారా, రైకా బాగ్‌లోని జుగల్ జోడి ఆలయాన్ని వసుంధర రాజే సందర్శించారు. సేనాచార్య అచలానంద గిరి మహారాజ్‌ను ఆమె కలిశారు. అలాగే పోఖ్రాన్ సమీపంలోని రామ్‌డియోరా మందిరాన్ని కూడా వసుంధర రాజే సందర్శించారు.





## అనుష్క ఘాటి రిలీజ్ గ్లింప్స్..

చాలా కాలం తర్వాత స్వీటీ అనుష్క నుంచి వస్తున్న అవైటెడ్ చిత్రమే "ఘాటి". దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందడంతో ఆల్రెడీ సాలిడ్ బజ్ ఈ సినిమాపై ఉంది. అయితే దానిని మరింత లెవెల్లో పెంచే విధంగా ఇప్పుడు వచ్చిన రిలీజ్ గ్లింప్స్ ఉందని చెప్పాలి. రెబల్ స్టార్ ప్రభాస్ లాంచ్ చేసిన ఈ గ్లింప్స్ ఫుల్ ఆన్ యాక్షన్ మోడ్ లో కనిపిస్తుండడం సినిమాపై భారీ హైప్స్ పెంచిందని చెప్పాలి. స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ 'ఘాటి' కాగా, ఈ నెల సెప్టెంబర్ 5న గ్రాండ్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ యాక్షన్ డ్రామా రేపు విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమా విడుదలకు ఒక్క రోజు ముందు, అంటే గురువారం, ప్రత్యేకంగా రూపొందించిన 'ఘాటి రిలీజ్ గ్లింప్స్'ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేయడం విశేషం. అనుష్క-ప్రభాస్ మధ్య ఉన్న బంధాన్ని చూసి ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్లింప్స్‌లో అనుష్క శెట్టి పవరపుల్ పాత్రలో అద్భుతంగా కనిపించింది. విజువల్స్ గ్రాండియర్, నేపథ్య సంగీతం అన్నికూడా సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. 'ఘాటి' చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ ఈ సినిమా రూపొందింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

### ఆ కారణంతోనే సినిమాలు తగ్గించానంటున్న అనుష్క శెట్టి

టాలీవుడ్ టాప్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'ఘాటి' సెప్టెంబర్ 5న గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమైంది. . ఈ సందర్భంగా అనుష్క ఓ ఇంటర్వ్యూలో సినిమాపై, తన పాత్రపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఘాటి చిత్రంలో శీలావతి పాత్ర నాకు ప్రత్యేకమైనది. ఇప్పటివరకు చేసిన పాత్రల్లో భిన్నంగా ఉంటుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# కవిత రాజీనామాపై బీజేపీ మంటలు.. రామచందర్‌రావు సంచలన వ్యాఖ్యలు

బీఆర్ఎస్ నుంచి కవిత రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కవిత రాజకీయ భవిష్యత్తుపై పలు ఊహాగానాలు వెలువడుతున్న వేళ, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత బీజేపీలో చేరే అవకాశాలను రామచందర్‌రావు తేలికపెట్టేశారు. అవినీతి పరులకు బీజేపీలో స్థానం లేదని స్పష్టం చేశారు. ఆమెను తమ పార్టీలోకి తీసుకునే ప్రశ్నే లేదని ఖరాఖండిగా చెప్పారు. దీంతో కవిత బీజేపీలోకి వచ్చే అవకాశాలు పూర్తిగా తిలకించబడ్డాయి. 'గబ్బర్‌సింగ్ టాక్స్' అంటూ విమర్శలు చేసిన కవితపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు రామచందర్‌రావు. అలాంటి వ్యాఖ్యలు చేయడం అనాగరికంగా ఉందని, తలలో మెదడు లేకుండా పెండ (గోబర్) ఉన్నట్టు మాట్లాడుతున్నారు అంటూ మండిపడ్డారు. ఇది రాజకీయ సాంకేతికతను పూర్తిగా ఉల్లంఘించే చర్య అని పేర్కొన్నారు. కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు లేవని, అవి అన్నదమ్ముల్లాంటివని వ్యాఖ్యానించారు రామచందర్‌రావు. ఈ రెండు పార్టీలు రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపించారు. ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీనే అలాంటి మార్పుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని ధీమా వ్యక్తం చేశారు.



# భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు: టిటిడి

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులను మాయమాటలతో మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి హెచ్చరించింది. గత వారం రోజుల క్రితం భక్తురాలు శ్రీమతి ఊర్వశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గూగుల్ ద్వారా వసతి కోసం వెతికే క్రమంలో శ్రీనివాసం రెస్ట్ హౌసెస్ అనే వెబ్ సైట్ లో ఇచ్చిన మొబైల్ నెంబర్ 8062180322 ను సంప్రదించగా, అభిమన్యు అనే వ్యక్తి తాను శ్రీనివాసం కాంప్లెక్స్ లో రిసెప్షన్ కి చెందిన వాడినని తప్పుడు సమాచారంతో పరిచయం చేసుకున్నాడు. సదరు భక్తురాలికి వసతి కల్పిస్తామని నమ్మబలికి కొంత మొత్తాన్ని వసూలు చేశాడు. డబ్బు చెల్లిస్తే వసతి టికెట్ ను పిడిఎఫ్ పంపిస్తామని హామీ ఇచ్చాడు. డబ్బు తీసుకున్న తర్వాత సదరు నిందితుడు తన ఫోన్ కాల్స్ , వాట్సాప్ మేసేజ్ లకు స్పందించకుండా మోసం చేశాడు. దీంతో నకిలీ వెబ్ సైట్ ద్వారా మోసపోయానని గ్రహించిన సదరు భక్తురాలు 1930 క్రైమ్ హెల్ప్ లైన్ కు, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.



# పంజాబ్ లో వరద బీభత్సం: 37 మంది మృతి

పంజాబ్‌లో వరద బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు కురవడంతో నదులు, కాలువలు ప్రమాదస్థాయిని దాటి ప్రవహించాయి. వరదలో కొట్టుకొనిపోయి ఇప్పటివరకు 37 మంది మృతి చెందారు. పంజాబ్ పలు గ్రామాలు నీళ్లలో మునిగిపోయాయి. రహదారులన్నీ జలమయంగా మారాయి. పశువులు వరదలలో కొట్టుకొనిపోయి వందల సంఖ్యలో చనిపోయి ఉంటాయని స్థానిక మీడియా వెల్లడించింది. పంజాబ్‌లో 37 ఏళ్ల తర్వాత భారీ వర్షపాతం నమోదైంది. 23 జిల్లాల్లో 1.75 లక్షల హెక్టార్ల పంట నష్టం జరిగింది. పంజాబ్ ప్రభుత్వం రూ.71 కోట్ల తక్షణ సాయం ప్రకటించింది. ఈ నెల 7 వరకు పంజాబ్‌లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. కేంద్రం నుంచి తక్షణమే సహాయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.




# కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు

ఎమ్మెల్సీ కవిత విషయంలో పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేసి కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు అని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. గత రెండు, మూడు రోజులుగా కవిత మాట్లాడుతున్న మాటలు చూస్తున్నాం. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కవిత తన తీరుతో పార్టీ కి ఎంతో నష్టం చేశారు. బీఆర్ఎస్‌కు సంపద లాంటి వ్యక్తి హరీష్ రావు.. ఆయనను బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణకు నష్టం కాదా..? అని ఆమె ప్రశ్నించారు. కార్యకర్తగా, నేతగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా అందరికీ అందుబాటులో ఉండి పనులు చేసిన వ్యక్తి హరీష్ రావు. నాడు హరీష్ రావు పనితీరును పొగిడిన వారే నేడు ఆరోపణలు చేస్తున్నారు. వారికి ఎలా మనసు ఒప్పుతుందో అర్థం కావడం లేదు. ఈటెల రాజేందర్ పార్టీ నుండి వెళ్లిపోవడంలో హరీష్ రావు పాత్ర లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల మీద శాసనసభలో హరీష్ రావు కాంగ్రెస్ డొల్లతనాన్ని ఎండగట్టారు. కవిత హరీష్ రావును టార్గెట్ చేసి మాట్లాడడం విడ్డూరంగా ఉందని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.

# వరల్డ్ వైడ్‌గా రూ.9 వేల కోట్ల కలెక్షన్లు.. ఓటీటీలోకి వచ్చేసిన హాలీవుడ్ చిత్రం

హాలీవుడ్ నుంచి వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న లైవ్ యాక్షన్ చిత్రం 'లిలో అండ్ స్టిచ్' తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ సినిమా ప్రస్తుతం ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమాకు డీన్ ఫ్లీషర్ క్యాంప్ దర్శకత్వం వహించగా.. మైయా కీలోహా, సిడ్నీ అగుడాంగ్, క్రిస్ సాండర్స్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్, రైడ్‌బ్యాక్ సంయుక్తంగా నిర్మించాయి. మే 23న థియేటర్‌లోకి వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.9123 కోట్ల వసూళ్లను సాధించి ఈ ఏడాది అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హవాయిలోని ఒక ద్వీపంలో తల్లిదండ్రులు చనిపోయి ఒంటరితనాన్ని అనుభవిస్తున్న లిలో అనే చిన్నారి జీవితంలోకి స్టిచ్ అనే ఒక గ్రహాంతరవాసి ప్రవేశిస్తాడు. స్టిచ్ చూడడానికి కుక్కపిల్లల ఉండడంతో కుక్కని పెంచుకుంటున్నాను అనుకోని లీలో స్టిచ్‌ని ఇంటికి తెచ్చుకుంటుంది. అయితే స్టిచ్ లీలో జీవితంలోకి ప్రవేశించాక జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా స్టోరీ.






# రామ్ ఫ్యాన్స్ గెట్ రెడీ..

టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని హీరోగా నటిస్తోన్నతాజా ప్రాజెక్ట్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. RAPO 22గా మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 28న విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. కాగా ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ పప్పీ షేమ్ లాంచ్ అప్‌డేట్ అందించారు. ఈ పాటను సెప్టెంబర్ 8న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటిస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ రామ్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఈ మూవీలో రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# గ్రానైట్ వ్యాపారులతో సంచలన వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్

ఇంకెన్నాళ్లు బిఆర్ఎస్ కు దోచిపెడతారని గ్రానైట్ వ్యాపారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. గ్రానైట్ వ్యాపారులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేయడంతో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు ఖంగుతున్నారు. సమాజానికి పనికొచ్చే సేవ చేయరా? తనపై నిందలేసినా ఖండించరా? అని అడిగారు. చైనాతో సంబంధాలు మెరుగుపర్చినా ప్రధాని నరేంద్ర మోడీకి థాంక్స్ చెప్పరా? అని నిలదీశారు. భయపడుతూ ఎన్నాళ్లు వ్యాపారం చేస్తారని, స్వేచ్ఛగా వ్యాపారం చేసే పరిస్థితిని తాను కల్పిస్తానని స్పష్టం చేశారు. పిఎం మోడీ చైనాలో పర్యటన చేయడంతో వ్యాపార సంబంధాలు మెరుగవుతున్నాయని గ్రానైట్ వ్యాపారులు తెలిపారు. సమాజానికి సేవ చేయాలని బండి సూచించడంతో చేస్తామని చెప్పిన సంఘం నేతలు తెలిపారు. అధికారులకు గ్రానైట్ వ్యాపారులు సహకరించాలని బండి సంజయ్ కోరారు.

### స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి..

# నల్గొండలో విషాదం

పేరుపెరిగిన నల్గొండ పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. నల్గొండ పట్టణంలోని దుప్పలపల్లి రోడ్డులో వెలువడిన ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తోరగల్ గ్రామానికి చెందిన ఒక చిన్నారి స్కూల్‌కి వెళ్తుండగా ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయింది. పాఠశాలకు బయలుదేరిన సమయంలో ఘటన సంభవించింది. బస్సు వద్దకు చేరే క్రమంలో నిర్లక్ష్యంగా జరిగిన ఈ ఘటన కొద్ది క్షణాల్లోనే పెద్ద విషాదంగా మారింది. బస్సు డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. చిన్నారిని చూసిన పలువురు స్థానికులు వెంటనే స్పందించి రక్షించేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బస్సును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు సేకరిస్తూ కేసును దర్యాప్తు చేస్తున్నారు. స్కూల్ బస్సుల నిర్వహణపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు గుండెలవిసే బాధలో మునిగిపోయారు. గ్రామమంతా కన్నీటి నదిగా మారిపోయింది. ఈ ప్రమాదం మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.



# శృతిమించిన అందాల ఆరబోత

తాజాగా వకీల్ సాబ్ బ్యూటీ అనన్య నాగళ్ళ షేర్ చేసిన కొన్ని ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారాయి. ఈ పిక్స్ చూసి కుర్రాళ్ళు పిచ్చెక్కిపోతున్నారు. అందాల ఆరబోతలో తగ్గేదే లే అన్నట్లుగా ఉంది నేటితరం కుర్ర హీరోయిన్ల తీరు. సినిమా అవకాశాల వేటలో భాగంగా తమ లేలేత పరువాలను ఆన్ లైన్ మాధ్యమాలపై పరిచేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా వకీల్ సాబ్ బ్యూటీ అనన్య నాగళ్ళ షేర్ చేసిన కొన్ని ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారాయి.ఖమ్మం జిల్లాకు చెందిన అచ్చ తెలుగు అందం అనన్య నాగళ్ళ.. మల్లేశం సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైంది. సినిమాలపై ఉన్న ఆసక్తితో సినిమాలకు రాకముందే నటనలో శిక్షణ పొంది కెమెరా ముందుకొచ్చింది. తొలుత కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చేసి మల్లేశం సినిమాతో సినీ ఎంట్రీ ఇచ్చింది.

# కలల నుంచి కార్పొరేట్ శిఖరానికి...

# ముంద్రు ఫణీంద్ర



**జీవితంలో ఎక్కడి నుంచి ప్రారంభమయ్యామన్నది ముఖ్యం కాదు... ఎక్కడికి చేరతామన్నదే మన విలువను నిర్ణయిస్తుంది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, విద్యార్థి దశ నుంచే కష్టపడుతూ, మూడు విభిన్న రంగాల్లో - సాఫ్ట్‌వేర్, ఆటోమొబైల్, మీడియాలలో తన ముద్ర వేసిన వ్యక్తి ముంద్రు ఫణీంద్ర. ఫణీంద్ర కథ కేవలం వ్యాపార విజయమే కాదు, పట్టుదలతో కలల్ని సాకారం చేసుకున్న ఒక నిజ జీవిత ఉదంతం. జీవితంలో సాధించాలన్న తపన, సాధించేవరకు ఆగని కృషి; ఈ రెండు గుణాలే తనను నేడు విశిష్టమైన వ్యక్తిని చేసాయి.**

1990 సెప్టెంబర్ 19న జన్మించిన ఫణీంద్ర , చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, నిజాయితీ, విద్య పట్ల గౌరవం వంటి విలువలను అలవాటు చేసుకున్నారు.తండ్రి ముంద్రు అబ్రహం నిబద్ధత, తల్లి ముంద్రు మణి సహనం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి.సోదరి మాతంగి రమ్యావిద్యాసాగర్ ఎల్లప్పుడూ అండగా నిలిచి, ప్రతి అడుగులో ప్రోత్సాహం అందించింది.ఈ కుటుంబ బంధమే ఆయన ప్రతి విజయానికి పునాది.

ఫణీంద్ర చిన్నప్పటి నుంచే కేవలం చదువు మీదే కాకుండా, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తిని పెంపొందించుకున్నారు. కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి, ఏ పని చేసినా నాణ్యతతో చేయాలనే పట్టుదల ఆయన విజయసుత్రాలు. ఈ విలువలు, ఆయన తల్లిదండ్రులు నేర్పిన జీవన సూత్రాలు, ఆయన ప్రతి నిర్ణయంలో ప్రతిఫలించాయి. ఫణీంద్ర తల్లిదండ్రులు ఎల్లప్పుడూ "ఏ పని చేసినా నాణ్యతతో చేయాలి" అనే సూత్రాన్ని బోధించారు. ఈ విలువలు ఆయన వ్యక్తిత్వానికి గట్టి పునాది వేశాయి.

బి.టెక్ రెండో సంవత్సరం చదువుతున్న సమయం నుంచే ఫణీంద్ర స్వతంత్రంగా పనిచేయడం మొదలుపెట్టారు. గూగుల్ ఆఫ్‌లైన్ అసైన్‌మెంట్లు చేసి, టెక్నాలజీ ప్రపంచాన్ని లోతుగా అర్థం చేసుకున్నారు. ఆ సమయంలోనే దేశ, విదేశాల కస్టమర్ల కోసం అనేక వెబ్‌సైట్లు డిజైన్ చేసి, సాంకేతిక నైపుణ్యాలలోనూ పట్టు సాధించారు. చదువుతో పాటు చేసిన ఈ ప్రాజెక్టులు ఆయనలో విశ్వాసాన్ని పెంచి, పెద్ద స్థాయి ప్రాజెక్టులను తీసుకునే ధైర్యాన్ని ఇచ్చాయి.



Thenisa Tech
Soft Solutions Pvt. Ltd.

"రోజు పగలు కాలేజీ క్లాసులు, రాత్రి ప్రాజెక్టులు... నిద్రకన్నా నా కలలను నిజం చేసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయించాను" అని ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ ఫణీంద్ర చెబుతారు.

దాదాపు పదకొండు సంవత్సరాల కృషి, వ్యూహాత్మక ఆలోచన, మరియు నిరంతర శ్రమతో "దెనిసా టెక్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్" అనే సాఫ్ట్‌వేర్ సంస్థను స్థాపించారు.ఈ కంపెనీ కస్టమర్ అవసరాలను ముందుగానే అంచనా వేసి, సమయానికి వినూత్న పరిష్కారాలు అందించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ సంస్థ కస్టమ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ వంటి విభిన్న సేవలను అందిస్తూ, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విశ్వాసాన్ని సొంతం చేసుకుంది.


"కస్టమర్-ఫస్ట్" అనే సిద్ధాంతాన్నిఫణీంద్ర ప్రతి ప్రాజెక్ట్‌లో పాటిస్తారు. పారదర్శక విధానాలు, నాణ్యతకు ప్రాధాన్యత, మరియు సమయపాలనలో రాజీ పడని ధోరణి ఈ సంస్థ విజయానికి కారణమయ్యాయి. ఫణీంద్ర నాయకత్వం తో పాటు నాణ్యతతో కూడిన ప్రమాణాలు, బృందంపై నమ్మకం, సృజనాత్మకతకు ప్రోత్సాహం ; కంపెనీకి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చింది.

టెక్నాలజీ రంగంలో విజయాలను అందుకున్న తర్వాత, ఆటోమొబైల్ రంగంలో కూడా అడుగుపెట్టారు.తన భార్య స్రవంతితో కలిసి అబిగైల్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించారు.తమ కుమార్తె పేరుతోనే కంపెనీకి పేరు పెట్టడం ద్వారా వ్యాపారానికి కుటుంబ అనుబంధాన్ని జోడించారు.కస్టమర్ విశ్వాసం, పారదర్శక సేవలు, నాణ్యత ; ఇవే అబిగైల్ విజయానికి ప్రధానమైన మూలాలు.

ఫణీంద్ర మీడియా రంగంలో కూడా సమాంతరంగా ముందుకు సాగారు.తెలుగు దినపత్రిక సూర్యలో కార్పొరేట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ, పత్రిక నిర్వహణలో కొత్త విధానాలు తీసుకువచ్చారు.ఆయన దూరదృష్టి, వ్యూహాత్మక ఆలోచనలు పత్రికకు మార్కెట్‌లో కొత్త ఉత్సాహం నింపాయి.

భార్య స్రవంతి వ్యాపార నిర్ణయాల్లో భాగస్వామ్యం అవుతూ, ప్రతి సందర్భంలో అండగా నిలిచారు.పిల్లలు అబిగైల్, మాల్విన్ అబ్రహం ఆయన ప్రతీ విజయానికి ప్రేరణ.వ్యాపార ఒత్తిడిలో కూడా కుటుంబంతో గడిపే సమయాన్ని ఫణీంద్ర అత్యంత విలువైనదిగా భావిస్తారు.









వ్యాపారాల్లో ఎప్పుడూ మార్పులు, పోటీలు, మరియు అనిశ్చితి సహజం. ఫణీంద్ర ఈ సవాళ్లను వెనుకడుగు వేయడానికి కారణంగా కాకుండా, కొత్త అవకాశాలుగా మలచుకున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రారంభ దశలో నమ్మకం సంపాదించడం, క్లయింట్లను దీర్ఘ కాలంలో ఉండేలా చేయడం పెద్ద సవాల్. కానీ, ప్రతి ప్రాజెక్ట్‌ను సమయానికి, నాణ్యతతో పూర్తి చేయడం ద్వారా ఆ సవాలును అధిగమించారు. అందుకే క్రమంగా అంతర్జాతీయ క్లయింట్ల వరకు ఈ సంస్థ పరిధి విస్తరించింది.


ఆటోమొబైల్ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు కూడా కొత్త బ్రాండ్‌ను మార్కెట్‌లో స్థాపించడం అంత సులభం కాదు. పెద్ద కంపెనీల పోటీలో నిలవాలంటే ప్రత్యేకమైన సేవలు, వినూత్న ఆలోచనలు అవసరమని ఫణీంద్ర గుర్తించారు. కస్టమర్-సెంట్రిక్ దృక్పథం, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ రెండింటిలో సమగ్ర మార్కెటింగ్ వ్యూహం, మరియు కస్టమర్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మార్పులు చేర్పులు చేయడం ద్వారా "అబిగైల్ ఆటోమొబైల్స్"కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.

ఫణీంద్ర దృష్టిలో వ్యాపారం అంటే కేవలం లాభం కాదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సమాజానికి విలువైన మార్పులు తీసుకురావడం ఆయన ప్రధాన లక్ష్యాలు. "వ్యాపారం సమాజాన్ని బలోపేతం చేయగల వేదిక" అని ఆయన నమ్మకం.

మూడు విభిన్న రంగాల్లో విజయాన్ని సాధించడం సమయ నిర్వహణ మాత్రమే కాదు, ప్రతి రంగం ప్రత్యేకతను అర్థం చేసుకుని, సార్వత్రిక నాయకత్వ సూత్రాలను అన్వయించడం అవసరం. ఫణీంద్ర ప్రతి వ్యాపారంలో సమర్థమైన మేనేజ్మెంట్ టీమ్‌ను నిర్మించి, వారికి నిర్ణయాధికారాన్ని ఇచ్చి, వ్యూహాత్మక దిశను మాత్రం తనదైన శైలిలో చూపిస్తారు.

ఫణీంద్ర భవిష్యత్తులో మరిన్ని రంగాలలో తన వ్యాపార పరిధిని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సొల్యూషన్లపై దృష్టి సారించడం, ఆటోమొబైల్ రంగంలో ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీసింగ్ మరియు కస్టమైజేషన్ విభాగాలను ప్రవేశపెట్టడం ఆయన ప్రణాళికలో ఉన్నాయి. అలాగే, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులపై మరింత దృష్టి పెట్టాలనుకుంటున్నారు. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, చిన్న వ్యాపారాలకు డిజిటల్ టూల్స్ అందించడం, మరియు పర్యావరణ స్నేహపూర్వక వ్యాపార మోడల్స్‌ను రూపొందించడం ఆయన భవిష్యత్ కార్యాచరణలో భాగం.

ముంద్రు ఫణీంద్ర జీవన ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయ గాథ కాదు , అది ఒక స్పష్టమైన సందేశం కూడా. పట్టుదల, కృషి, నిజాయితీ, మరియు స్పష్టమైన దిశ ఉంటే ఏ కల అయినా నిజం కావచ్చని ఆయన నిరూపించారు. విద్యార్థి దశలోనే అనుభవాన్ని సంపాదించడం నుంచి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థలను స్థాపించడం వరకు, ఆయన ప్రతి అడుగూ ప్రణాళికాబద్ధంగానే కాక, విలువలతో నిండినదే.తన కుటుంబం మద్దతుతో, తన సొంత శ్రమతో, విభిన్న రంగాలలో సుస్థిర స్థానం సంపాదించడమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా తన వ్యాపారాలను నడపడం ఆయన ప్రత్యేకత. భవిష్యత్తు కోసం ఆయన సాంకేతికతను, నూతన ఆలోచనలను, మరియు మానవీయ దృక్పథాన్ని మిళితం చేయాలనుకోవడం, ఆయనలోని దూరదృష్టిని సూచిస్తుంది.తరతరాలకు ప్రేరణగా నిలిచే ఈ ప్రయాణం, ప్రతి ఒక్కరికీ - "స్వప్నాలను కేవలం చూడకండి, వాటిని సాధించడానికి శ్రమించండి" అనే సత్యాన్ని గుర్తు చేస్తుంది.



Thenisa Tech
Soft Solutions Pvt. Ltd.